క్లుప్తంగా

ఆరోగ్య నియమాలు పాటించాలి

ఖానాపురం: విద్యార్థులు ఆరోగ్య నియమాలు పాటిస్తూ వ్యాధులకు గురికాకుండా ఉండాలని బుధరావుపేట ఆయుర్వేద వైద్యాధికారిణి శ్రీలత అన్నారు. మండలంలోని అశోక్‌నగర్ కేజీబీవీ పాఠశాలలో ఆయుష్ శాఖ ఆధ్వర్యం లో విద్యార్థులకు రాగి లడ్డూలు, ఆయుష్ కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రతను పాటిస్తూ చదువుకోవాలన్నారు. కార్యక్రమం లో స్పెషల్ ఆఫీసర్ మేనక, పాల్గొన్నారు.

ఎంపీడీఓగా శ్రీనివాసరావు

నర్సంపేట రూరల్ : స్థానిక ఎంపీడీఓగా అంబాల శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీనివాసరావు నిజామాబాద్ ఎంపీడీఓగా విధులు నిర్వహించి సెలవుపై వెళ్లారు. నర్సంపేట ఎంపీడీఓగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఇంద్రసేనారెడ్డి సెలవుపై వెళ్తుండడంతో ఆ స్థానంలో శ్రీనివాసరావుకు బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్‌పై ఫిర్యాదు

నర్సంపేట: అంగన్‌వాడీటీచర్ నల్ల భారతిపై కలెక్టర్, కమిషనర్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రికి శుక్రవారం ఇటీవల డీసీపీఓగా రిలీవ్ అయిన మహేందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ నుంచి వేతనం తీసుకుంటూ సంబంధం లేని విషయాల్లో తలదూర్చిందని, తన వ్యక్తిగత జీవితానికి భంగం వాటిల్లే విధంగా పత్రిక ప్రకటన చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాను చేసిన ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురి చేశాయన్నారు. ఇందులో భాగంగానే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భారతిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

'ఎమ్మెల్యే పెద్దిపై ఆరోపణలు అవాస్తవం'

చెన్నారావుపేట : ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై తప్పుడు ఆరోపణలు సరికాదని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బాధావత్ విజేందర్‌నాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళా శిశుసంక్షేమ శాఖలో డీసీపీఓగా పనిచేసిన మహేందర్‌రెడ్డి తల్లిదండ్రులు తమ కుమారుడికి ఎమ్మెల్యే పెద్ది, దివ్యాంగుల రాష్ట్ర చైర్మన్ వాసుదేవరెడ్డితో ప్రాణహాని ఉందని చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అన్నివర్గాలకు అండగా నిలిచే పెద్దిపై తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. వెంటనే వారి ఆరోపణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సద్వినియోగం చేసుకోవాలి



రాయపర్తి: ప్రభుత్వం కల్పించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ అన్నారు. మండలంలోని గన్నారంలో లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల భాస్కర్, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెల్లోజు వెంకటచారి, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, మండల శ్రీలత, శ్రీనివాస్, బెల్లి పెద్దాపురం, ఉల్లెంగుల సుధాకర్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం



రాయపర్తి: ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని ప్రతి ఒక్కరూ ఆర్టీసీ బస్సులో ప్రయాణం కొనసాగించాలని టీఎస్‌ఆర్టీసీ వరంగల్ -1 డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం మండలంలోని కొండూరులో ప్రజల వద్దకు ఆర్టీసీ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రవేశపెట్టిన పథకాలను గురించి వివరించారు. ఆర్టీసీ వికలాంగులకు 50 శాతం చార్జీ రాయితీతో బస్సులో ప్రయాణించవచ్చన్నారు. స్కూల్ పిల్లలకు ఫ్రీ బస్సులు, కళాశాల పిల్లలకు రాయితీతో కూడిన బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. అడ్వాన్స్ లేకుండా పెళ్లిళ్లకు, శుభకార్యాలకు బస్సులను అద్దెకు ఇస్తున్నట్లు చెప్పారు. తిరుమల దైవదర్శనానికి ఆర్టీసీ బస్సును బుక్ చేసుకుంటే దర్శన టికెట్లు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరితరవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

కొనసాగుతున్న పరీక్షలు

ఖానాపురం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు శుక్రవారం కొనసాగాయి. 132 మంది విద్యార్థులకు గాను ఏడుగురు గైర్హాజరయ్యారు. ఇందులో ఒక విద్యార్థిని అరగంట ఆలస్యంగా రావడంతో సెంటర్ అధికారులు, పోలీసులు విద్యార్థినిని వెనక్కి పంపించారు. దీంతో ఆ విద్యార్థిని నిరాశతో వెనుతిరిగింది.

వైభవంగా 'బద్దిపోచమ్మ' జాతర

- హాజరై దర్శించుకున్న ఎమ్మెల్యే పెద్ది
- భారీ సంఖ్యలో హాజరైన భక్తులు



బద్దిపోచమ్మను దర్శించుకునేందుకు బోనాలతో వెళ్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, భక్తులు

నల్లబెల్లి: రెండేళ్లకోసారి జరిగే కూన వంశీయుల ఆరాధ్యదైవమైన బద్దిపోచమ్మ తల్లి జాతరను మండలంలోని బొల్లోనిపల్లి శివారు పోచంపల్లిలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ప్రధాన పూజారి కూన నారాయణస్వామి, రములు ప్రత్యేక పూజలు చేయగా భక్తులు కుటుంబ సమేతంగా ప్రతి ఇంటి నుంచి బోనాలు, ప్రభబండ్లు డప్పుచప్పుళ్లతో బయలుదేరగా మండల ప్రజలతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. బద్దిపోచమ్మతో పాటు ఊరపోచమ్మ, లక్ష్మీదేవ త, కనుకదుర్గమ్మ, పెద్దమ్మతల్లులకు కల్లు, కోడి, గొర్రెలు, బోనాలతో మొక్కులు సమర్పించారు. కోరుకున్న కోరికలు తీర్చాలని భక్తులు పొర్లుదండాలు పెట్టారు. ప్రభబండ్లను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రారంభించారు. ఆలయానికి ఎదురుగా నిలిపి ఉంచిన ప్రభబండ్లు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆలయ పరిసరాల్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బద్దిపోచమ్మ తల్లి జాతరను భక్తుల కోరిక మేరకు కనీస సౌకర్యాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, చెట్టుపల్లి మురళీధర్, బానోత్ సారంగపాణి, శ్రీని వాస్‌గౌడ్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్ గుప్త, నానబోయిన రాజారాం, చంద్రమౌళి, రాంబాబు, సర్పంచ్ తిప్పని సృజన, ఎంపీటీసీ బోళ్ల శ్రీలత పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

- మండల సభకు గైర్హాజరైన సర్పంచ్‌లు



సభలో నివేదికను చదివి వినిపిస్తున్న నోడల్ ఆఫీసర్ రాంచందర్‌రావు

నర్సంపేట రూరల్ : మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ మోతె కళావతి పద్మనాభరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సభకు 11 మంది ఎంపీటీసీలకు ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. కోఆప్షన్ కూడా సభకు రాలేదు. 27 గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు ఒక్కరుకూడా హాజరు కాలేదు. దీంతో మండల సభ తూతూమంత్రంగా కొనసాగింది. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సభకు హాజరవుతారని ప్రచారం చేసినప్పటికీ అధికారులు పూర్తిస్థాయిలో వచ్చినప్పటికీ, సర్పంచ్‌లు మాత్రం గైర్హాజరయ్యారు. చివరి నిమిషంలో ఎమ్మెల్యే కూడా మండల సభకు రావడంలేదని చెప్పడంతో అధికారులు మాత్రం నివేదికలను చదివి సభను కొనసాగించారు. గ్రామపంచాయతీలకు సకాలంలో నిధులు రాకపోవడం, అభివృద్ధి పనులను చేసినప్పటికీ వాటికి సంబంధించిన బిల్లులు రాకపోవడంతో కొంతమేర సర్పంచ్‌లు విసుగుపోయి ఉన్నట్లు సమాచారం. ఈ సభతో తేటతెల్లమైందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

నర్సంపేట : పట్టణంలోని సిద్దార్థ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం లీడ్ డిస్ట్రిక్ట్ బ్యాంకు వరంగల్ సహకారంతో కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన వలంటీర్లకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీడ్ బ్యాంక్ ఫైనాన్షియల్ కో ఆర్డినేటర్ భాస్కరాచారి హాజరై వలంటీర్లకు రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్, సేవింగ్, లోన్స్, డిజిటల్ బ్యాంకింగ్, సైబర్ క్రైమ్, ఆర్‌బీఐ అంబుడ్స్‌మెన్ గురించి వివరించారు. విద్యారుణం, ఎంట్రపెన్యూర్ రుణాలు ఏ విధంగా పొందాలి. బ్యాంకింగ్ రంగ సేవల గురించి ఆడియో, వీడియో ప్రదర్శనల ద్వారా తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లంతా ఆర్థిక అక్షరాస్యత గురించి అవగాహన తెలుసుకున్న అంశాలను విధిగా వారి కుటుంబ సభ్యులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ గొంగళ్ల అశోక్, సీఎఫ్‌సీ కో ఆర్డినేటర్లు కళ్యాణ్, నరేష్, వలంటీర్లు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాలకు అండగా ఉంటాం

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నర్సంపేట : కార్మిక కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో కార్మికులకు శుక్రవారం దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వంచే నూతనంగా ఆరు గోదాంలను నిర్మించినట్లు తెలిపారు. లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాముల్లో అనేక మంది కార్మికులకు ఉపాధి అవకాశాలు లభించాయన్నారు. కార్యక్రమంలో ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రసాద్‌రావు, గ్రేట్-2 ఆఫీసర్ శివశంకర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణ, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, హమాలీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కొమురయ్య, ప్రసాద్, మునీశ్వర్, సంజీవ, రవి, అడ్తి అసోసియేషన్ అధ్యక్షుడు గందె చంద్రమౌళి, పాల్గొన్నారు.

20న సాధారణ మహాసభ

చెన్నారావుపేట: చెన్నారావుపేట సొసైటీ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 66వ సాధారణ మహాసభను ఈనెల 20న నిర్వహించనున్నట్లు చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు సంఘ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. పాలకవర్గం, సంఘ సభ్యులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

నెక్కొండ సంతకు వేలం

- గతేడాది కంటే రూ. 26.18 లక్షలు అధికం



వేలం పాటలో పాల్గొన్న కాంట్రాక్టర్లు

నెక్కొండ: స్థానిక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించే వారంతపు సంత (అంగడి) వేలం పాటలు జీపీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గతంలో కంటే రూ. 26.18 లక్షల అధిక ఆదాయం జీపీకి చేరింది. ఈ సంవత్సరం వేలంలో గుత్తేదారుల మధ్య తీవ్ర పోటీ రావడంతో పాటలు రసవత్తరంగా సాగాయి. గత సంవత్సరం పాటలు నిర్వహించగా అప్‌సెట్ ధర రాకపోవడంతో పలు మార్లు వాయిదా పడ్డాయి. చివరకు డీపీఓ ఆదేశాల మేరకు సీల్డ్ కవర్ ద్వారా గుత్తేదారుల ఎంపిక చేశారు. దీంతో జీపీకి ఆదాయం గండి కొట్టి కేవలం 2022-23 గానూ రూ. 16.82 లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. ఈయేడు 2023-24కు నిర్వహించిన వేలంలో ఏకంగా రూ.43 లక్షల ఆదాయం సమకూరిందని ఈఓ సదానందం తెలిపారు. వేలం పాటల్లో మేకల, గొర్రెల రహదారి గుత్తేదారు పోరండ్ల రమేష్ రూ. 36 లక్షలకు పాడి టెండర్ దక్కించుకున్నారు. అలాగే తైబాజార్‌ను గుత్తేదారు కంచర్ల వెంకన్న రూ. 7 లక్షలు పాడి దక్కించుకున్నారు. వేలంలో ఉపసర్పంచ్ వీరభద్రయ్య, వార్డు సభ్యులు, గుత్తేదారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ ప్రవీణ్ అక్రమ అరెస్టుపై నిరసనలు



వర్ధన్నపేట : రోడ్డుపై నుంచి ఆందోళనకారులను తొలగిస్తున్న ఎస్సై రామారావు

వర్ధన్నపేట : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టును నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి అంబేడ్కర్ సెంటర్ వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జ్, రాష్ట్రకార్యదర్శి మాదారపు రవికుమార్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో చేపట్టారు. దీంతో జాతీయ రహదారిపై ఇరువైపుల వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్సై రామారావు ఆందోళనకారుల వద్దకు పోలీస్ సిబ్బందితో చేరుకుని వారిని బలవంతంగా ఆందోళనకారులను రోడ్డుపై నుంచి తొలగించి అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ టీఎస్పీఎస్ పేపర్ లీకేజీ వల్ల ఎందరో నిరుద్యోగుల బతుకులు వీధిన పడ్డాయన్నారు. అక్రమ అరెస్టును తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనికి బాధ్యులైన టీఎస్పీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని అరెస్టు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యకర్తలు, నాయకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

నర్సంపేట : టీఎస్ పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీపై సీబీఐతో విచారణ చేపట్టాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గుంటి వీరప్రకాశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే ఎంతో మంది జీవితాలు బాగుపడతాయని ఆశ పడ్డామన్నారు. టీఎస్ పీఎస్సీ ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్లతో ఆశలు చిగురించాయన్నారు. కానీ ప్రభుత్వ నిఘా వైఫల్యం కారణంతో ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. సీబీఐతో విచారణ జరిపించి నిరుద్యోగులకు అన్యాయం జరుగకుండా చూడాని కోరారు. పేపర్ లీకేజీ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి నిరుద్యోగ అభ్యర్థులకు ఒక్కొక్కరికీ రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ ప్రకటనల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తు ప్రకటనలు రాగానే ఎన్నో ఆశలతో నిరుద్యోగ యువత అప్పు చేసి కోచింగ్ తీసుకున్నారన్నారు. పేపర్ లీకేజీపై గన్‌పార్క్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ అరెస్టును తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో ఖానాపురం మండల బీజేపీ అధ్యక్షుడు ఆబోతు రాజు, మాజీ మండల అధ్యక్షుడు గుడిపూడి రాధాకృష్ణ, లింగబత్తుల యాకసాయన్న, సీనియర్ నాయకులు ఆంజనేయులు, అశోక్, నర్సంపేట మండల కార్యదర్శి చల్లా రాం చంద్రారెడ్డి, విజయ్, పాల్గొన్నారు.

చెన్నారావుపేట : రాష్ట్రంలోని నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేయడం సిగ్గుచేటని లింగాపురం సర్పంచ్ తప్పెట రమేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది ఉద్యమాలు చేసి ఆత్మబలిదానాలు చేశారన్నారు.

ధర్మంవైపు నిలిచిన ఉపాధ్యాయులు



నర్సంపేట : బాణాసంచా కాలుస్తున్న బీజేపీ నేతలు



సంగెంలో ..



వర్ధన్నపేటలో..

నర్సంపేట: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు ధర్మంవైపు నిలిచారని నర్సంపేట నియోజకవర్గ బీజేపీ నాయకుడు గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపుపై శుక్రవారం స్వీట్లు పంపిణీ చేసి బాణా సంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఖానాపురం మండల అధ్యక్షుడు ఆబోతు రాజు, మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణ, లింగబత్తుల యాకస్వామి, ఆంజనేయులు, అశోక్, రాంచంద్రారెడ్డి, విజయ్, సాయికుమార్, రంజిత్, సందీప్‌రెడ్డి, పాల్గొన్నారు.

సంగెం : మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు శుక్రవారం బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ పరకాల ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బుట్టి కుమారస్వామి, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, నాయకులు సతీష్, కృష్ణ, సమ్మిరెడ్డి, రాజు, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

వర్ధన్నపేట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి ఘన విజయం సాధించడంతో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బీజేపీ నాయకులు బాణాసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు, జడ సతీష్, రాయపురం కుమారస్వామి, పెద్దూరి రాజ్‌కుమార్, కొండేటి సత్యం, చీటూరి రాజు, విక్రమ్, బోంపెల్లి దేవేందర్‌రావు, ఐత రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే పనులు



వరంగల్ (పర్వతగిరి): నిబంధనల మేరకే రోడ్డు పనులు చేపడుతున్నామని పంచాయతీరాజ్ శాఖ డీఈ బాబురావు తెలిపారు. మండలంలోని చౌటపల్లి నుంచి చింతనెక్కొండ వరకు జరుగుతున్న బీటీ రోడ్డు పనులను నాణ్యతా లోపంతో నిర్మిస్తున్నారని రైతులు అడ్డుకున్న విషయం విదితమే. దీంతో శుక్రవారం డీఈ సందర్శించి రైతుల సమక్షంలో రోడ్డు నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లడుతూ నాణ్యతలో ఎక్కడా నిర్లక్ష్యం లేదని తెలిపారు. ఆయన వెంట అధికారులు, రైతులు ఉన్నారు.

రవీందర్ బాధ్యతల స్వీకరణ



నర్సంపేట: స్థానిక ఆర్టీసీ డిపో ఎస్టీఐగా పెద్ది రవీందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్టీఐ ఏపీపీ కుమార్ వరంగల్-2 డిపోకు బదిలీపై వెళ్లారు. 1985 బ్యాచ్‌కు చెందిన రవీందర్ ఆర్టీసీ డ్రైవర్, ఏడీసీ, ఆయిల్ డీసీ, వరంగల్ ఉమ్మడి జిల్లాకు స్కాడ్ ఇన్‌చార్జ్, భూపాలపల్లి డిపో ఎస్టీఐ విధులు నిర్వహించారు. ఈ మేరకు నర్సంపేట డిపోకు శుక్రవారం బదిలీపై వచ్చారు.

బాధిత కుటుంబానికి చేయూత

వర్ధన్నపేట: పట్టణానికి చెందిన ఆలకుంట సాలమ్మ (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా ఏడవ వార్డు కౌన్సిలర్ పాలకుర్తి సుజాత, సారంగపాణి దంపతులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని ఓదార్చి రూ. 5వేలు ఆర్థికసాయం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పరామర్శించిన వారిలో మార్త సారంగపాణి, ఆలకుంట సుధాకర్, ఆలకుంట ఎర్రయ్య, బొంత రంగనాథ్, శివరాత్రి రాములు, ఓర్సు ఎల్లయ్య, వెంకటనర్సు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శుక్రవారం బీఆర్ఎస్ మండల కన్వీనర్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఆయన వెంట సిద్దార్థ గురుకుల హైస్కూల్ ప్రిన్సిపాల్ అండెం కర్ణాకర్‌రెడ్డి, సర్పంచ్ మల్లయ్య, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం

చెన్నారావుపేట: బాధిత కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వంతో పాటు ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు కంది కృష్ణచైతన్యరెడ్డి అన్నారు. మండలంలోని అక్కల్ చెడకు చెందిన బాదావత్ చీనమ్మ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.54వేలను ఎమ్మెల్యే పెద్ది మంజూరు చేయించగా శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చీనమ్మ కుటుంబానికి గతంలో కూడా సీఎం సహాయ నిధి నుంచి డబ్బులు మంజూరు చేయించినటుట్లు తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ భూక్య కిషన్, వీరు, రాంచంద్రు, కృష్ణ, వసంత, తదితరులు ఉన్నారు.

బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడికి మాతృ వియోగం

దుగ్గొండి: మండలంలోని చాపలబండకు చెందిన నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి తల్లి సమ్మక్క(80) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని ఏఐసీసీ సభ్యుడు దొంతి మాధవరెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన వెంట పీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కల్లపెల్లి రవీందర్‌రావు, దుగ్గొండి, నర్సంపేట, ఖానాపురం, చెన్నారావుపేట మండల పార్టీ అధ్యక్షులు ఎర్రల్ల బాబు, లక్ష్మణ్‌నాయక్, హరిబాబు, గోపాల్‌నాయక్, మండల నాయకులు,తదితరులు ఉన్నారు.

కొద్దిపాటి వర్షానికే జలమయం



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వర్ధన్నపేట: పట్టణంలో శుక్రవారం ఉదయం కురిసిన కొద్ది పాటి వర్షానికే వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి జలమయంగా మారింది. రహదారికి ఇరువైపుల నిర్మించిన డ్రెయినేజీల్లో చెత్తా చెదారం చేరడంతో నీరు నిలిచి వర్షపు నీరు ఎస్‌బీఐ సమీపంలో ఆర్టీసీ బస్టాండ్ వద్ద నీరు బయటకు వెళ్లక పోవడంతో సుమారు మూడు గంటలపాటు రోడ్డుపై నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదర్కొన్నారు. మున్సిపాలిటీ అధికారులు అప్రమత్తమై సిబ్బందితో నిలిచిన నీరు మురుగునీరు చెత్తా చెదారం తొలగించారు. దీంతో నీరు బయటకు వెళ్లడంతో ప్రయాణికులు ఇబ్బందుల నుంచి బయటపడ్డారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా.. వ్యక్తి దుర్మరణం

రాయపర్తి: అదుపుతప్పి ఆటో బోల్తాపడిన ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని పెర్కవేడు శివారు గట్టికల్ క్రాస్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై బండారి రాజు కథనం ప్రకారం.. పెర్కవేడుకు చెందిన గారె సాయిలు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన చిప్ప కృష్ణ(42) కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. సాయిలు తన సొంత పని నిమిత్తం కృష్ణని ఆటోలో తీసుకెళ్లగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడిన ఘటనలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. తన కొడుకును ఆటోపై తీసుకెళ్లి తన మృతికి కారకుడైన సాయిలుపై చర్య తీసుకోవాలని మృతుడి తల్లి కనుకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు బోల్తా... పలువురికి గాయాలు

రాయపర్తి: అదుపుతప్పి కారు పల్టీకొట్టిన ఘటనలో పలువురు గాయపడిన సంఘటన మండలంలోని మైలారం శివారులోని వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఖమ్మం నుంచి వరంగల్ వైపు కారు వెళ్తుండగా అదుపుతప్పి పల్టీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరో ఐదుగురికి స్వల్పగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ వైరు తెగిపడి గేదెలు మృతి

గీసుకొండ: మండలంలోని విశ్వనాథపురంలో కల్లూరి శ్రీనివాస్‌కు చెందిన రెండు పాడిగేదెలు ఇంటి ఆవరణలో కట్టేసి ఉండగా పైనుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైరు తెగి వాటిపై పడటంతో షాక్ తగిలి శుక్రవారం మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. సుమారు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లిందన్నారు. ఎంపీపీ భీమగాని సౌజన్య, కాంగ్రెస్ మండల నాయకులు సాయిలి ప్రభాకర్ రైతును పరామర్శించారు. రైతుకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి

వరంగల్ (పర్వతగిరి): విద్యుత్ షాక్‌తో గొర్రె మృతి చెందిన సంఘటన మండలంలోని చౌటపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన క్యాతం ఎల్లయ్యకు చెందిన గొర్రె రోజు మాదిరిగానే మేతకు తీసుకెళ్తుండగా రోడ్డు వెంట ఉన్న స్తంభం వైరు తగిలి మృతి చెందిందన్నారు.

కోతులదాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

రాయపర్తి: కోతుల దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలకేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలకేంద్రానికి చెందిన రామంచి మహేందర్ రహదారి వెంట వస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కోతులు అతనిపై దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. కోతుల బెడద నివారించాలని కోరుతున్నారు.

కొలన్‌పల్లిలో వీధి కుక్కల దాడి

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లిలో వీధి కుక్కలు పాడి గేదె, దూడపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలోని కొలన్‌పల్లి జయరాంతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన లావుడియా మంగ్యాకు చెందిన పాడిగేదె, దూడను తన పాకలో కట్టేశాడు. వీధికుక్కలు పాడిగేదెపై దాడిచేయడంతో పాటు దూడను గాయపర్చి చంపేశాయి.